పార్థివ వాహనమేది..?

- మృతదేహాలను తరలించడానికి నిరుపేదలకు ఇబ్బందులు
- రూ. వేలు వసూలు చేస్తున్న ప్రైవేటు అంబులెన్స్ సర్వీసులు
- పేదలపై మోయలేని ఆర్థిక భారం
- మెదక్ జిల్లాకు పార్థివవాహనం కేటాయించాలని డిమాండ్

మెదక్ జిల్లా దవాఖానలోని పార్థివ వాహనం (ఫైల్)

మెదక్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : ఇటీవల మెదక్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి, ఓ వ్యక్తి మృతి చెందాడు. వారిది పేదకుటుంబం కావడంతో మృతదేహాన్ని తరలించడానికి ద వాఖానలో పార్థివదేహాన్ని తరలించే వాహనం కోసం సిబ్బందిని సంప్రదించగా, వాహనం లేదని చెప్పడంతో రూ.5 వేలు ఖర్చు పెట్టి ప్రైవేట్ అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించారు. ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజలు వేల రూపాయలు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేట్ దవాఖానలో చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక సర్కారు దవాఖానల్లో ఉచిత వైద్యం చేయించుకుంటున్నామని, ప్రమాదవశాత్తు ఆపులు మరణిస్తే అప్పు చేసి మరీ మృతదేహాన్ని తీసుకెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని మెదక్ జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్థివ వాహనం లేక ఇబ్బందులు...

మెదక్ జిల్లా దవాఖానతోపాటు నర్సాపూర్ ఏరియా దవాఖాన, తూప్రాన్‌లో కమ్యూనిటీ దవాఖాన ఉన్నాయి. జిల్లా దవాఖానకు వివిధ ప్రాంతాల నుంచి రోగులు, ప్రమాదాల్లో గాయపడిన వారిని తరలించి చికిత్స అందిస్తుంటారు. ఈ సందర్భంగా ఎవరైనా చనిపోతే మృతదేహాలను తరలించడానికి కుటుంబసభ్యులు నానాఅవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు పార్థివ వాహనాన్ని కేటాయించింది కానీ, మెదక్ జిల్లాకు మాత్రం మంజూరు చేయలేదు. దీంతో ప్రైవేట్ అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తుండడంతో వేలకువేలు చెల్లించాల్సి వస్తున్నది.

ప్రైవేటు అంబులెన్స్‌ల దందా..

జిల్లా దవాఖానలో పార్థివదేహాన్ని తరలించే వాహనం లేకపోవడంతో ప్రైవేట్ అంబులెన్స్‌ల యజమానులు మృతదేహాలను తరలించడానికి భారీగా డిమాండ్ చేస్తున్నారు. కనీస దూరానికి సైతం రూ.3వేల నుంచి రూ.5వేలకు పైగా అడుగుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ దవాఖానల్లో ఉచిత చికి త్స చేయించుకునేందుకే ఇబ్బందులు పడుతున్న తాము ఈ ఆర్థికభారాన్ని మోయలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా దవాఖానకు పార్థివవాహనాన్ని కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

బీఆర్ఎస్ నేతకు పితృవియోగం

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

భిక్షపతి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

నిజాంపేట,ఫిబ్రవరి12 : మండలంలోని వెంకటాపూర్(కె) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత దయాకర్ తండ్రి రాంపురం భిక్షపతి (83) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం వెంకటాపూర్(కె) గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం భిక్షపతి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ సిద్ధిరాములు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నిజాంపేట, కల్వకుంట, రాంపేట పీఏసీఎస్ చైర్మన్లు బాపురెడ్డి, అందె కొండల్‌రెడ్డి, చంద్రం, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచులు అనీల్‌కుమార్, అమరసేనారెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు రాజు, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు అబ్దుల్‌ఆజీజ్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనర్సింహులు, ధర్మారెడ్డి,రంజిత్‌గౌ డ్, నగేశ్, మహేశ్, నందు తదితరులు ఉన్నా రు.

సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానం

బాలురను అభినందిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12 : రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని మెదక్ కలెక్టర్ రాజర్షిషా సోమవారం శాలువాతో సన్మానించి అభినందించారు. ఈనెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో హవేళీఘనపూర్ మండల కేంద్రానికి చెందిన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన సుమంత్ వందకు 91 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానం సాధించాడని రాష్ట్ర సోషల్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు రతంగపాణి రెడ్డి, వెంకటేశ్వర్లు విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్, సోషల్ ఫోరం జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు నర్సింలు, లక్ష్మన్, మండల విద్యాధికారి నీలకంఠం, సోషల్ ఫోరం సభ్యులు దేవిసింగ్, వీరేశం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకిష్టయ్య పాల్గొన్నారు.

మెదక్ జిల్లాకు బంగారు పథకం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12 : హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో ఈనెల 10, 11వ తేదీల్లో జరిగిన 9వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్ బాల్ చాం పియన్‌షిప్ పోటీల్లో మెదక్ జిల్లా బాలుర జట్టు బంగారు పథకం సాధించిందని జిల్లా యువజన క్రీడాల అధికారి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మెద క్ కలెక్టర్ రాజర్షి షా బాలుర జట్టును అభినందించారు. కార్యక్రమంలో కోచ్ షానవాజ్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్‌శర్మ, ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కోనాపూర్ విద్యార్థులు

రామాయంపేట, ఫిబ్రవరి 12 : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు రామాయంపేట మండలం కోనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం అయిత శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గుడిసె మనోహర్ పాటల విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి నేడు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మరో విద్యార్థిని గుడిసె అద్వైత ఉపన్యాస పోటీల్లో మండల, జిల్లా పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఇద్దరు విద్యార్థులు చదువుతో పాటు కల్చరల్ పోటీల్లో అద్భుత ప్రతిభ ప్రదర్శించి కోనాపూర్‌కు రాష్ట్రస్థాయిలో పేరు, ప్రతిష్టలు తీసుకొచ్చారని అభినందించారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నర్సింలు

నర్సింలుకు నియామక పత్రం అందిస్తున్న కృష్ణయ్య

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12 : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పట్టణానికి చెందిన చింతల నర్సింలును నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నర్సింలుకు నియామక పత్రాన్ని అందజేశారు. మెదక్ జిల్లాలో బీసీలను ఒకే తాటిపైకి తేవాలని నర్సింలుకు కృష్ణయ్య సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షు డు మెట్టు గంగారాం, నాయకులు వెంకటి, ఆంజనేయులు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీలు విక్రయిస్తే కఠిన చర్యలు

తనిఖీ చేస్తున్న మెదక్ వ్యవసాయ సహాయసంచాలకులు విజయనిర్మల

చేగుంట, ఫిబ్రవరి 12 : ఆగ్రోస్‌తో పాటు ప్రతి ఎరువుల దుకాణంలో యజమానులు స్టాక్ రిజిస్టర్లను తప్పని సరిగా నిర్వహించాలని మెదక్ వ్యవసాశాఖ సహాయ సంచాలకులు విజయనిర్మల పేర్కొన్నారు. నార్సింగిలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, రైతు ఉత్పత్తి దారుల సంఘాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. దుకాణంలో స్టాక్, ఈ పాస్ మిషన్‌లో ఉన్న స్టాక్, ధరల పట్టిక, సరుకు డెలివరీ చాలాన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో యజమానులు స్టాక్ రిజిస్టర్లు తప్పని సరిగా మెయింటెన్ చేయాలని, నకిలీ విత్తనాలు, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏడీఏ వెంట నార్సింగి మండల వ్యవసాయశాఖాధికారి యాదగిరి తదితరులున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి ఒక్కరోజు జైలు

నిజాంపేట, ఫిబ్రవరి12 : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి న్యాయస్థానం ఒక రోజు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు సోమవారం నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జనవరి 5న నిజాంపేటలో స్థానిక పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా, మద్యం మత్తులో గ్రామానికి చెందిన బెస్త రాములు వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. ఈ మేరకు రాములును స్పెషల్ మొబైల్ కోర్టు మెదక్ నందు హాజరు పర్చగా మెజిస్ట్రేట్ కల్పన ఒక రోజు జైలుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

- మెదక్ కలెక్టర్ రాజర్షి షా
- ప్రజావాణి కార్యక్రమానికి 69 దరఖాస్తులు

మెదక్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని మెదక్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 69 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ధరణి, భూ సమస్యల పరిష్కారం కోసం 44 మంది, పింఛన్ కోసం 6 మంది, ఉద్యోగ, ఉపాధి కోసం 2, ఇతర సమస్యల గురించి 17 మంది అర్జీలు ఇచ్చారని పేర్కొన్నారు. స్వీకరించిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్‌ఓ పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

జాయింట్ సెక్రెటరీగా చేగుంట యువకుడు

నియామక పత్రం అందజేస్తున్న హైదరాబాద్ జాయింట్ లేబర్ కమిషనర్ శ్యాంసుదర్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి 12 : తెలంగాణ మూవీ, టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికల్లో చేగుంటకు చెందిన కర్రె రామ్మోహన్ జాయింట్ సెక్రెటరీగా అత్యధిక మెజార్టీతో ఎన్నికయ్యారు. హైదరాబాద్ జాయింట్ లేబర్ కమిషనర్ శ్యాం సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని సారథి స్టూడియోలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో 136 ఓట్ల ఆధిక్యతతో జాయింట్ సెక్రెటరీగా కర్రె రామ్మోహన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మించే సినిమాల్లో తెలంగాణ నటీనటులకు ఎక్కువ అవకాశాలు దక్కేలా కృషి చేస్తానని తెలిపారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు

ఆలయంలో స్వామివారికి కానుకలు అందిస్తున్న భక్తులు

రామాయంపేట, ఫిబ్రవరి 12 : పట్టణంలోని గోదాసమేత పద్మావతీ వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం పూజారి నల్లంది హాల్ వెంకటరమణాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, నైవేద్యాలను సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. సంకష్ట హర చతుర్దశి పూజల్లో భాగంగా మొదట గణపతి పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి హోమం కార్యక్రమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 12 : పోక్సో కేసులో నిందితుడికి మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. లక్ష్మీశారద జీవిత ఖైదుతో పాటు రూ. లక్ష జరిమానా విధించినట్లు ఎస్పీ డాక్టర్ బాలస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పంచముఖి కాలనీకి చెందిన కర్ణ కంటి గోపాల్(42)పై గతేడాది పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. పూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.లక్ష జరిమానాను విధించినట్లు పేర్కొన్నారు. నిందితుడికి శిక్షపడే విధంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఫజల్ అహ్మద్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌కుమార్, ఇన్వెస్టిగేషన్ అధికారి మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, పోలీసులను అభినందించారు.

మత్స్యశాఖ అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

మెదక్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు జరిగే వరకు తాత్కాలికంగా 11 మంది సభ్యులతో అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారు. చీఫ్ ప్రమోటర్‌గా మానేగాల్ల రాంకిష్టయ్య, సభ్యులుగా అంగని దుర్గేశ్, బీస శ్రీనివాస్, గడప దేవేందర్, పుల్కంటి పెంటయ్య, గాండ్ల కృష్ణ, జంగం చిన్న స్వామి, కాయిత భాగయ్య, భవానీ అంజయ్య, గాజుల భాగయ్య, కొత్తూరి నర్సింలును ఎన్నుకున్నారు.

కిడ్నాప్ కలకలం

- రామాయంపేట బస్టాండులో మహిళ ను చితకబాదిన ప్రయాణికులు

రామాయంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

రామాయంపేట, ఫిబ్రవరి 12 : చిన్నారులను అపహరిస్తుందనే అనుమానంతో ఓ మహిళపై కొంతమంది వ్యక్తులు మూకుమ్మడిగా దాడికి పాల్పడిన ఘటన సోమవారం రామాయంపేట బస్టాండ్‌లో చోటుచేసుకున్నది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని డి. ధర్మారం గ్రామానికి చెందిన పత్తిరి పోషవ్వ అనే మహిళ చేగుంట వెళ్లేందుకు రామాయంపేట బస్టాండ్‌కు చేరుకున్నది. ఆ సమయంలో అక్కడే ఉన్న కొంతమంది ప్రయాణికులు, వ్యక్తులు పోషవ్వ చిన్నపిల్లలు ఎత్తుకెళ్లేందుకే వచ్చిందంటూ భావించి ఆమెపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఆమె స్పృహతప్పి పడిపోయింది. విషయం పోలీసులకు తెలవడంతో ఘటనా స్థలానికి చేరుకుని పోషవ్వకు నీళ్లు తాగించి పోలీస్‌స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు. తన సొంత గ్రామం డి ధర్మారం అని చిన్నపిల్లల ఆట వస్తువులు విక్రయిస్తుంటానని పోషవ్వ పోలీసులకు తెలిపింది. ఆమె తండ్రి పేరు తెలుసుకుని స్థానిక సర్పంచ్ బొడ్డు శంకర్ ఫోన్ చేసి తండ్రిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పోషవ్వను అతడికి అప్పగించారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను ఎవరూ నమ్మొద్దని, ఎలాంటి అనుమానం ఉన్నా తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు ఈ సందర్భంగా సూచించారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ఎస్జీటీ స్కూల్ అసిస్టెంట్ల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సదానందంగౌడ్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 12 : ఎస్జీటీ స్కూల్ అసిస్టెంట్‌ల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సదానందంగౌడ్ మాట్లాడుతూ కేజీబీవీ, ఎస్ఎస్ఏలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించి రూ.10 వేల వేతనం చెల్లించాలన్నారు. ఖర్మకాండలు చేసిన ఉద్యోగికి 15 రోజుల వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని సూచించారు. ఆదాయపన్ను పరిమితిని రూ.10లక్షలకు పెంచాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ నాయకులు పోచయ్య, రాజు, కిష్టయ్య, భూపతిగౌడ్, అశోక్, శివప్రసాద్, నరేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధన్‌రెడ్డి బ్రదర్స్ సేవలు మరువలేనవి

గోవర్ధన్‌రెడ్డి బ్రదర్స్‌కు పీఆర్టీయూ డైరీని అందజేస్తున్న యూనియాన్ సభ్యులు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 12 : మండలంలోని చండూర్ గ్రామానికి చెందిన చౌటకూరి గోవర్ధన్‌రెడ్డి బ్రదర్స్ విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాలకు చేసిన సేవలు మరువలేనివని మండల పీఆర్టీయూ నాయకులు తులసీరా వు, గురివినాయుడు, శ్రీనుబాబా తెలిపారు. సోమవారం గోవర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పీఆర్టీయూ డైరీని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గోవర్ధన్‌రెడ్డి బ్రదర్స్ సహకారంతో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రతి ఉపాధ్యాయుడికి సన్మానం చేశామన్నారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మం డలంలో విద్యాభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందజేస్తానన్నారు.

ఘనంగా భక్త మార్కండేయ జయంతి

మార్కండేయ స్వామి విగ్రహం, మంగళ హారతులతో మహిళలు

రామాయంపేట/అల్లాదుర్గం, ఫిబ్రవరి 12 : భక్తమార్కండేయ జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పద్మశాలీలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారికి మంగళహారతులు, నైవేద్యాలు సమర్పించారు. గర్భగుడిలో జ్యోతిర్లింగానికి పాలతో అభిషేకాలు చేసి దీపాలను వెలిగించారు. అనంతరం రామాయంపేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీ చైర్మన్ మద్దెల రమేశ్, మాధవి దంపతులు భక్త మార్కండేయ చిత్రపటంతో పట్టణంలో ఊరేగింపు చేపట్టారు. మహిళా భక్తులు మంగళహారతులతో ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమాల్లో పురోహితుడు బల్ల రాజయ్య, కమి టీ సభ్యులు బల్ల యాదగిరి, మద్దెల రమేశ్, సుధాకర్, చలిమెట్టి నాగరాజు, బల్ల సుధాకర్, లక్ష్మణ్, కట్ట తిర్మల్, గోపి, శ్రీనివాస్, తిరుపతి, డి.రామ్‌చంద్రం, భూమేశ్, మద్దెల స్వామి, రాజు, భరత్, కర్రె నరేందర్, బాసం శ్రీనివాస్ మహిళా భక్తులు పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో..

భక్తమార్కండేయ జయంతి వేడుకలను సోమవారం అల్లాదుర్గంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కండేయ ఆలయంలో భక్తులు ఉదయం ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో రాములు, శ్రీకాంత్, పెంటయ్య, లక్ష్మణ్, యాదగిరి, చిన్న ఉన్నారు.

అయోధ్యకు సైకిల్ యాత్ర

పెద్దశంకరంపేట నుంచి యాత్రగా బయలు దేరుతున్న భానుచందర్‌గౌడ్

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 12 : పట్టణానికి చెందిన బలగం భానుచందర్‌గౌడ్ సోమవారం ఉదయం పెద్దశంకరంపేటలోని రామాలయం నుంచి అయోధ్యకు సైకిల్ యాత్రగా బయలుదేరారు. అయోధ్యలోని శ్రీరాముడికి అరకిలో వెండితో తయారుచేసిన ధనస్సు(బాణం)ను సమర్పించేందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. రామాలయం వద్ద ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, గ్రామపెద్దలు గంగారెడ్డి, దశరథ్, తదితరులు సన్మానించారు.

రూ. 3 లక్షల నగదు చోరీ

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 12 : దొంగలు ఇంట్లో చొరబడి మూడు లక్షల నగదు అపహరించిన ఘటన పెద్దశంకరంపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన స్వర్ణకారుడు అవుసుల శ్రీనివాసచారి ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా పగులగొట్టి రూ.3 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం 11 గంటలకు శ్రీనివాసచారి ఇంటికి వచ్చి తాళం తీసి లోపలికి వెళ్లి చూడగా, బీరువా పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఏఎస్ఐ సునీత సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడు శ్రీనివాసచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

రేగోడ్, ఫిబ్రవరి 12 : గ్రామపంచాయతీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని పంచాయతీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో సీతారామమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు సమయానికి ప్రతినెలా వేతనాలు, నెలకు సరిపడా సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం భోజనానికి గంట విరామం కేటాయించాలని డిమాండ్ చేశారు. రేగోడ్ గ్రామపంచాయతీ యూనియన్ ప్రధాన కార్యదర్శి నగేశ్, సిబ్బంది ఉన్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

పాపన్నపేట, ఫిబ్రవరి 12 : పంచాయతీ సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎల్.అశోక్ సోమవారం పాపన్నపేట ఇన్‌చార్జి ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు మూడు నెలలుగా చెల్లించాల్సిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని, గ్రామాల్లో ప్రత్యేకాధికారుల వేధింపులు ఆపాలని, మధ్యాహ్న భోజనానికి గంట సమయం కేటాయించాలని, కార్మికులందరికి గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ సంఘం సభ్యులు మాణిక్యం, పోచయ్య తదితరులున్నారు.

'మోడల్' ప్రవేశాలకు దరఖాస్తు

రేగోడ్, ఫిబ్రవరి 12 : మోడల్ స్కూల్ ప్రవేశానికి విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 150 మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారన్నారు. దరఖాస్తుకు తుది గడువు ఈ నెల 22 వరకు ఉందని, ఏప్రిల్ 7న పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి రేగోడ్ మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులు www.telanganams.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓపెన్ పరీక్ష ఫీజుకు 21 గడువు

పాపన్నపేట, ఫిబ్రవరి 12: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజును ఈ నెల 21లోగా చెల్లించాలని పాపన్నపేట మండల కో-ఆర్డినేటర్ మహేశ్వర్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ నరేందర్‌లు తెలిపారు. ఏప్రిల్, మే నెలలో నిర్వహించబోయే పరీక్షల కోసం ఒక్కో సబ్జెక్ట్‌కు వంద రూపాయల చొప్పున చెల్లించాలని, గడువు ముగిసిన తర్వాత ప్రతి సబ్జెక్టుకు రూ.25జరిమానాతో ఈ నెల 27 వరకు, రూ.50తో మార్చి 4వ తేదీ వరకు చెల్లించుకోవచ్చని వివరించారు.

భర్తకు తలకొరివి పెట్టిన భార్య

అంత్యక్రియలు నిర్వహిస్తున్న భార్య కళావతి

రామాయంపేట, ఫిబ్రవరి 12 : పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుతూ భర్తకు భార్య అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించింది. రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీకి చెందిన ఆముదాల కుమార్(55) ఆదివారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో బాత్‌రూంలో పడిపోయాడు. వెంటనే కుటుంబీకులు స్థానికంగా ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు కుమార్‌కు భార్య కళావతితో పాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మగసంతానం లేకపోవడంతో భర్తకు భార్య కళావతి అంత్యక్రియలు నిర్వహించింది. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.